పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి


గ్రామసభలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి నంద కిషోర్

కీసర: పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కీసర ప్రత్యేక అధికారి నంద కిషోర్ అన్నారు. గురువారం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అందుకే పారిశుద్ధ్య నిర్వహణ పనులు సవ్యంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. మండల పంచాయతీ అధికారి వినూత్నారెడ్డి, వైస్ ఎంపీపీ సత్తిరెడ్డి, వివిధ పార్టీల నాయకులు, మాజీ వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ తీసుకోవాలి


గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ రజితరెడ్డి

మేడ్చల్: గ్రామాల్లో అధికారులు పారిశుద్ధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి అన్నారు. మండలంలోని డబీల్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. అధికారులు పారిశుద్ధ్య సమస్యను పట్టించుకుని ఎప్పటికప్పుడు పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గ్రామసభలో జిల్లా కో ఆప్షన్ సభ్యుడు గౌస్, మాజీ సర్పంచ్‌లు రాజమల్లారెడ్డి, గీత భాగ్యారెడ్డి, నాయకులు అశోక్, శ్రీరాంరెడ్డి, మల్లేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం


తహసీల్దార్ సన్మానిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన రజినిని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆమెను కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, జహంగీర్, రవీందర్, ఎఫ్‌ఎస్‌సీఎస్ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, జంగయ్యాయాదవ్, రాధాకష్ణముదిరాజ్, నర్సింగ్‌రావు, సత్యనారాయణ, కృపానిధి, పోచయ్యముదిరాజ్, యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి విజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు భూమిపూజ


సీసీ రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న చైర్ పర్సన్ వసుపతి ప్రణీత

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో సీసీ రోడ్డు, డ్రైనేజీ కాలువ నిర్మాణానికి చైర్ పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్‌గౌడ్ గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ సాధారణ నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను శంకుస్థాపన చేశామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్.రాజమల్లయ్య, డీఈఈ చిరంజీవులు, స్థానిక వార్డు కౌన్సిలర్ సంపన్‌బోల్ స్వప్న, బీఆర్‌ఎస్ నాయకులు హరిగౌడ్, మహ్మద్ ఖాజామియా, కాలనీవాసులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు సన్మానం


కమిషనర్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ కమిషనర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన నాగిరెడ్డిని బీజేపీ పట్టణ నాయకులు కలిసి సన్మానించి స్వాగతం పలికారు. మున్సిపల్ కార్యాలయంలో ఆయనను నాయకులు కలిసి పట్టణ సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి ప్రేందాస్, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రాజు, శ్రీకాంత్, రాఘవరెడ్డి, వంశీధర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గ్రామ పంచాయతీకి కుర్చీల అందజేత



కీసర: కీసర గ్రామ పంచాయతీ కార్యాలయానికి 25 కుర్చీలను కాంగ్రెస్ మండల నాయకులు గురువారం అందజేశారు. కీసర ఎంపీఓ వినూత్నరెడ్డి, ప్రత్యేక అధికారి నంద కిషోర్, పంచాయతీ కార్యదర్శి గంగన్నకు కుర్చీలను అందజేసి సేవాభావాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్ కుమార్, వైస్ ఎంపీపీ సత్తిరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు రవీందర్, నాయకులు కృష్ణారెడ్డి, చిక్కుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్‌లో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ కో ఆపరేటివ్ ఫోరమ్ జిల్లా డైరీ 2024ను ఆవిష్కరిస్తున్న యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకులు - సాక్షి, మేడ్చల్ జిల్లా

దేశం గర్వించదగ్గ ఆధ్యాత్మికవేత్త

సేవాలాల్ మహారాజ్


జవహర్‌నగర్‌లో సేవాలాల్ జయంతి వేడుకల్లో ప్రొఫెసర్ కంచ ఐలయ్య


నాగారం మున్సిపాలిటీలో సేవాలాల్ జయంతిలో చైర్మన్ చంద్రారెడ్డి

ప్రొఫెసర్ కంచ ఐలయ్య

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో గోర్ బంజారా సంఘం ఆధ్వర్యంలో గురువారం సద్గురు సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రపంచ మేధావి, ప్రొఫెసర్ కంచ ఐలయ్య హాజరై మాట్లాడుతూ.. ఆంగ్ల విద్యతోనే బంజారాల్లో బంగారు భవిష్యత్ ఉందన్నారు. బంజారా సంస్కృతి, సంప్రదాయాలకు ఎంతో విశిష్టత ఉందని, సేవాలాల్ మహారాజ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. యావత్ భారతదేశం గర్వించదగ్గ ఆధ్యాత్మిక వేత్త సేవాలాల్ మహారాజ్ అని, సమాజానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. బంజారాలు ఎడ్లబండ్లపై ఊరూరా తిరుగుతూ వ్యాపారం చేసుకునేవారని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్పించిన రిజర్వేషన్లతోనే ఉద్యోగాల్లో రాణిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కారింగుల నిహారికగౌడ్, శ్రీకాంత్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్, బీఆర్‌ఎస్ అధ్యక్షులు కొండల్ ముదిరాజ్, బీజేపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షులు మండల సురేందర్, వెంకటేశ్వర్లు, పద్మారావు, పరుశురాం, కో-ఆప్షన్ సభ్యులు శ్వేతా ముఖేష్, బంజారా సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాప్రియదర్శిని కాలనీలో..

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరాప్రియదర్శిని కాలనీలో గురువారం సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్ విచ్చేశారు. ఈ సందర్భంగా హోమంతో పాటు ఇతర పూజా కార్యక్రమాలను బంజారా సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

కబడ్డీ టోర్నీ విజేతలకు బహుమతులు


బహుమతి అందజేస్తున్న జగదీశ్వర్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్ తదితరులు

ఘట్‌కేసర్: కొర్రెముల్‌లో రమేశ్ హనుమాన్ యూత్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు కొర్రెముల్‌కు చెందిన మునికుంట్ల రమేశ్‌గౌడ్ జ్ఞాపకార్థం నిర్వహించిన రాష్ట్ర స్థాయి మహిళల కబడ్డీ టోర్నీ ఘనంగా ముగిసింది. ముఖ్యఅతిథులుగా తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్, సంయుక్త కార్యదర్శి మద్ది మహేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేగౌడ్ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విజేతగా నిలిచిన నల్గొండ మహిళ జట్టుకు షీల్డ్‌తోపాటు రూ.50 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన రంగారెడ్డి జట్టుకు రూ.30 వేలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వినోద, మాజీ ఉప సర్పంచులు రాజుముదిరాజ్, నాగార్జున, మన్నెంముదిరాజ్, టోర్నీ నిర్వాహకులు పరమేశ్, వెంకటేశ్, మనోజ్, మల్లేశ్, నర్సింగ్, శివ, శ్రీహరి, బాబు, మహేశ్, నర్సింగ్‌రావు, కబడ్డీ క్రీడాకారులు పాల్గొన్నారు.

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: పట్టణంలోని హౌజింగ్ బోర్డు ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా శుక్రవారం పట్టణంలో పలు కాలనీల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని వినాయక్‌నగర్ 1, 2, హౌజింగ్ బోర్డు కాలనీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

నేటి సమ్మెను విజయవంతం చేయాలి

మేడ్చల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ శుక్రవారం చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎర్ర అశోక్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సంబు ప్రభాకర్ కోరారు. మేడ్చల్‌లో వారు మాట్లాడుతూ బంద్‌లో అన్ని రంగాల కార్మికులు, అన్ని యూనియన్ల కార్మికులు పాల్గొని సమ్మెను జయప్రదం చేసి కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేఖ విధానాలకు వ్యతిరేఖంగా పనిచేయాలని అన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మాజీ మంత్రి ఈటల రాజేందర్

మేడ్చల్‌రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని జీడిమెట్లలో ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించనున్న ఈటల ఫర్ మల్కాజిగిరి క్రికెట్ ట్రోఫి పోస్టర్‌ను గురువారం మేడ్చల్ మండలం పూడూర్ గ్రామ పరిధిలో ఉన్న ఆయన నివాసంలో నిర్వాహకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృషి, పట్టుదలతో ఏదైనా సాధించవచ్చని, క్రీడల్లో రాణిస్తే సమాజంలో గుర్తింపు ఉంటుందన్నారు. టోర్నీ నిర్వాహకులు రామిడి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఈటల ఫర్ మల్కాజిగిరి పేరిట రెండు రోజుల పాటు నిర్వహించనున్న క్రికెట్ టోర్నీలో క్రీడాకారులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ప్రథమ బహుమతి రూ.లక్ష, ద్వితీయ బహుమతి రూ.30 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి కృష్ణా యాదవ్, ఫిష్ పెడరేషన్ మాజీ చైర్మన్ రాజయ్యాయాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు మల్లారెడ్డి, నాయకులు భరత్‌సింహారెడ్డి, కో ఆర్డినేటర్ ముప్పిడి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఈటల రాజేందర్, నాయకులు

బాధ్యతల్లో జెడ్పీ సీఈవో



సాక్షి, మేడ్చల్ జిల్లా: జిల్లా పరిషత్ సీఈవోగా దిలీప్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. అలాగే జెడ్పీ డిప్యూటీ సీఈవోగా నీరజ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో దిలీప్ కుమార్, డిప్యూటీ సీఈవో నీరజా జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, కలెక్టర్ గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.



అగ్రికల్చర్ విద్యార్థులకు సన్మానం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి యూనివర్సిటీ పరిధి స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్సెస్‌లో బీఎస్సీ నాల్గవ సంవత్సరం విద్యార్థులు విదేశాల్లో లెర్నింగ్‌కు ఎంపిక కావడంతో గురువారం వారిని ఎమ్మెల్యే మల్లారెడ్డి అభినందించారు. గురువారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను అభినందించారు. అగ్రికల్చర్ సైన్సెస్ డీన్ రాజారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ విద్యార్థులు విదేశాల్లో లెర్నింగ్‌కు వెళ్లడం దేశంలో మొదటిసారి అని వివరించారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కలెక్టరేట్‌లో ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ పూర్తి



సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లాలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలో ఈ నెల 5 నుంచి ప్రారంభమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలైన ఈవీఎం, వీవీప్యాట్, బ్యాలెట్ బాక్స్ ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియ 15 నాటికి పూర్తయ్యిందని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియలో 26 మంది ఈసీఐఎల్ ఇంజినీర్ల బృందం పాల్గొన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను చెకింగ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. 14, 15 తేదీల్లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించిన అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఏవీఎం గోడౌన్లలో భద్రపరిచి సీల్ చేశామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ హరిప్రియ, తహసీల్దార్ రాజేశ్వర్‌రెడ్డి, పార్టీ ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గంలో ఈ నెల 24న జరిగే విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ యాత్ర మల్కాజిగిరి అసెంబ్లీ ఇన్‌చార్జి చాడా వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మల్కాజిగిరి పద్మావతి ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20వ తేదీన ఘట్‌కేసర్‌లో ప్రారంభమై 24న మౌలాలికి చేరుతుందన్నారు. అక్కడ నుంచి ఆనంద్‌బాగ్, వినాయకనగర్, నేరెడ్‌మెట్, యాప్రాల్ మీదుగా జరుగుతుందన్నారు. యాత్రను విజయవంతం చేయడానికి వివిధ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. నాయకులు ఆర్.కె.శ్రీనివాస్, వాశంశెట్టి శ్రీనివాస్, డీఎస్ వెంకటేష్, బాలచందర్‌గౌడ్, నాగరాజు, సునీల్‌యాదవ్, శ్రీనివాస్ ముదిరాజ్, నవీన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

5కె రన్ జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి



మహిళలు అన్నింట్లో ముందుండాలి

మేడ్చల్‌రూరల్: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని మల్లారెడ్డి విద్యాసంస్థల చైర్మన్, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన వండర్ ఉమెన్స్ 5కే రన్ ఫర్ ఈక్వాలిటీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండాలన్నారు. దైనందిన జీవితంలో శారీరక శ్రమ ఎంతో అవసరమని, నిత్యం వ్యాయామం, యోగా వంటి కార్యక్రమాలు చేపట్టాలని వాటితో ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. జుంబా వంటి డ్యాన్స్ కార్యక్రమాలతో విద్యార్థులు పాల్గొలని, మల్లారెడ్డి మహిళా కళాశాలలో విద్యార్థినులతో పెద్ద ఎత్తున 5కే రన్ చేపట్టడం అభినందనీయం అన్నారు. అనంతరం పలువురు విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మల్లారెడ్డి గ్రూప్స్ కార్యదర్శి మహేందర్‌రెడ్డి, డైరెక్టర్ శాలినీ రెడ్డి, ప్రిన్సిపాల్ మాధవిలత, యూనివర్సిటీ వీసీ వీఎస్‌కే రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల లేకపోవడం సిగ్గుచేటు

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్యామ్‌కిరణ్


నిరసనలో శ్యామ్‌కిరణ్, భాను, సచిన్

ఘట్‌కేసర్: మేడ్చల్ నియోజకవర్గంలో ఒక్క డిగ్రీ కళాశాల కూడా లేకపోవడం సిగ్గుచేటని, దీంతో పేద విద్యార్థులకు డిగ్రీ చదువు అందని ద్రాక్షగానే మిగిలిపోతుందని ఏబీవీపీ రాష్ట్ర కార్యసమితి సభ్యుడు అంకం శ్యామ్‌కిరణ్ అన్నారు. ఘట్‌కేసర్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే తమ కళాశాలలను విశ్వవిద్యాలయాలుగా మార్చడంలో చూపిస్తున్న శ్రద్ధ పేదలకు ఉపయోగపడే డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు రాజకీయ నాయకులు కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రగల్భాలు పలుకుతారని, చిత్తశుద్ధి ఉంటే ఏబీవీపీ చేస్తున్న ఉద్యమానికి సహకరించాలని అన్నారు. ఏబీవీపీ పట్టణ కార్యదర్శి భాను, టెక్నికల్ సెల్ కన్వీనర్ సచిన్, నవీన్, శివ, అభి, నాగరాజు, ఏబీవీపీ విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు 5 నెలలుగా వేతనాల్లేవ్..


ఎదులాబాద్ గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఎదులాబాద్ పంచాయతీ కార్యాలయం ఆవరణలో కార్యదర్శి నాగేశ్వర్‌రావు అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాన్ని పరిశుభ్రం చేసే పారిశుద్ధ్య కార్మికులకు 5 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో అర్థాకలితో అలమటిస్తున్నారని అన్నారు. ఈ విషయమై గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, వేతనలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సరళకుమార్, రవి, రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ ధర్మారెడ్డి, తిరుమల్‌రెడ్డి, రాంచందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా.. యువకుడి మృతి

యాదగిరిగుట్ట రూరల్: అదుపుతప్పి కారు బోల్తా పడటంతో ఓ యువకుడు మృతిచెందాడు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామ సమీపంలో మోటకొండూర్ మండలం వెళ్లే జంక్షన్ వద్ద హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారిపై గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా దమ్మాయిగూడకు చెందిన రాహుల్(25)తో పాటు కంసాని మనోజ్‌రెడ్డి, దాసరి సాయిచరణ్‌రెడ్డి, రాచపాట కార్తీక్, గంప రాజు కలిసి బుధవారం ఉదయం కారులో జనగామ జిల్లాలో తమ స్నేహితుడి పెళ్లికి వెళ్లారు. పెళ్లి అనంతరం గురువారం తెల్లవారుజామున జనగామ నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో తెల్లవారుజామున 4గంటల ప్రాంతంలో యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామ సమీపంలోకి రాగానే అతివేగంతో ఉన్న కారు మోటకొండూర్ జంక్షన్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న రాహుల్ అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను కూడా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఘట్‌కేసర్: ఇన్నోవా కారు బైక్‌ను ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ గోవర్ధనగిరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కీసర మండలం రాంపల్లి గ్రామానికి చెందిన డప్పు ప్రశాంత్(32), డప్పు శ్రీకాంత్ మంగళవారం రాత్రి ఘట్‌కేసర్‌లో పని ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఇన్నోవా కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న ప్రశాంత్‌కు తలకు, కడుపుకు తీవ్రగాయాలయ్యాయి. వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం ఉదయం మరణించాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.


డప్పు ప్రశాంత్(ఫైల్)

మాతా, శిశు సంరక్షణ లక్ష్యం



• డీఎంహెచ్ఓ రఘునాథ స్వామి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మాతా శిశు సంరక్షణ లక్ష్యంగా వైద్యులు పనిచేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ టి.రఘునాథస్వామి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో వైద్యాధికారులు గురువారం డాక్టర్ ఎస్.నారాయణరావు, డాక్టర్ ఆనంద్‌తో కలిసి కీసర, మల్కాజిగిరి డివిజన్ల డాక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్దిష్ట శిశు ఆరోగ్య, ప్రసూతి సంరక్షణ నాణ్యతను మెరుగుపర్చేందుకు మాతాశిశు మరణాలు తగ్గించాలన్నారు. ఇందులో పీహెచ్‌సీ, పల్లె, బస్తీ దవాఖానాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.